లీలాకృష్ణ నియామకంపై హర్షం

ప్రజాశక్తి - మండపేట

ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా మండపేట నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ వేగుళ్ళ లీలాకృష్ణ ఎంపిక పట్ల కూటమి పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ ఛైర్మన్ వరప్రకాష్, పిఎంపిల అధ్యక్షులు కోన సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న లీలాకృష్ణకు నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్‌గా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, మంత్రులు నాదెండ్ల మనోహర్, నారా లోకేష్, ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

భారీగా ఫీజుల దోపిడీ

- మరోసారి పెంచిన కార్పొరేట్ స్కూళ్లు
- పుస్తకాలు, యూనిఫారాల ధరల పెంపు
- ఆందోళనలో తల్లిదండ్రులు
- కొరవడిన అధికారుల నియంత్రణ

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

పలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు భారీగా దోపిడీకి పాల్పడుతున్నాయి. ఫీజులు, డొనేషన్ల పేరుతో తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి మరీ సొమ్ములు వసూలు చేస్తున్నాయి. నియంత్రణ లేని ఫీజుల వసూళ్లపై అధికారులు కనీసంగానైనా పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఈ ఏడాది జూన్ 12 నుంచి విద్యా సంస్థలు పున్ణ ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో 10 నుంచి 30 శాతం ఫీజులను పెంచి వసూలు చేసేందుకు ఇప్పటికే తల్లిదండ్రులకు నోటీసులు ఇచ్చాయి.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 1800 వరకూ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో 3 లక్షల 50 వేల మంది ఏటా చదువుతున్నారు. పలు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండానే ఆయా యజమాన్యాలు పబ్బం గడుపుతున్నాయి. విద్యా ప్రమాణాలకు నీళ్ల వదులుతూ అతిక్రమిస్తున్నాయి. సరైన వసతులు కల్పించకుండానే నడుపుతున్నారు. కనీసం అగ్నిమాపక శాఖ నిబంధనల ప్రకారం సేఫ్టీ ప్రమాణాలను పక్కన పెడుతున్నాయి. పరిమితికి మించి విద్యార్థులను తరగతి గదుల్లో ఉంచుతున్నారు. కనీస విద్యార్హతలు లేని ఉపాధ్యాయులతోనే బోధన సాగిస్తున్నారు. అనేక పాఠశాలలకు ఆట స్థలం కూడా లేని దుస్థితి నెలకొంది. బస్సుల్లో విద్యార్థులను కుక్కి మరీ నడిపిస్తున్నారు. దూరంతో సంబంధం లేకుండానే రవాణా ఛార్జీలను భారీగా వసూలు చేస్తున్నారు. ఇలా అనేక నిబంధనలను తుంగలోకి తొక్కి వ్యవహరిస్తున్న పరిస్థితి ఉంది.



దారుణంగా ఫీజులు పెంచి వసూలు

ప్రతి సంవత్సరం భారీగా ఫీజులు పెంచుతూ వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం. పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నాం. కనేసంగానైనా చర్యలు తీసుకోవడం లేదు. పేద, మధ్యతరగతి వర్గాలకు చదువు భారంగా మారుతోంది. ఇప్పటికైనా ప్రైవేటు యజమాన్యాల ఫీజులు వసూళ్లను తగ్గించాలి. ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి. వసతులను మెరుగు పర్చాలి.

- ఎం.గంగా సూరిబాబు, ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కార్యదర్శి.

భారీగా పెంచుతున్న ఫీజులు

తమ పాఠశాలల్లో చేర్పించండి అంటూ పదే పదే ఇళ్లకు తిరిగిన యాజమాన్యాలు తల్లిదండ్రులకు మాయ మాటలు చెప్పి తొలుత మగ్గులోకి దింపుతున్నాయి. ఆ తర్వాత భారీగా ఫీజులు పెంచి వసూలు చేస్తున్నాయి. వాస్తవానికి ప్రభుత్వం కొన్ని ఫీజులను నిర్దేశించింది. వాటికి నాలుగు నుంచి ఐదు రెట్లు పెంచి వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. తల్లిదండ్రులను అయోమయంలోకి నెడుతూ పిల్లల చదువుల బలహీనతలను ఆసరాగా చేసుకుంటూ ఫీజులు దండుతున్నాయి. ప్రతి సంవత్సరం రూ.10 వేల నుంచి రూ.20 వేలు పెంచి వసూలు చేస్తున్నారు. డొనేషన్ల పేరుతో తల్లిదండ్రులను దోచేస్తున్నారు. కాకినాడ, రాజమహేంద్రవరంలో ఉన్న కొన్ని యాజమాన్యాల ఇష్టారాజ్యానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ప్రైవేటు స్కూళ్ల అయితే రూ.30 వేల నుంచి రూ.60 వేలు, కార్పొరేట్ స్కూళ్ల రూ.లక్షల్లో దోచుకుంటున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు

యూనిఫారం, బూట్లు, టై, పుస్తకాల పేరుతోనూ దోపిడీ సాగుతోంది. పుస్తకాలకు రూ.5 వేలు నుంచి రూ.12 వేల వరకు వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం వీటిని విద్యాసంస్థల్లో విక్రయాలు జరపకూడదు. పైగా బహిరంగ మార్కెట్లో దొరికే వాటి కన్నా పది రెట్లు వసూలు చేస్తుండడం విస్మయకరమని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఫిర్యాదులు ఇస్తున్నా విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొరవడిన నియంత్రణ

తమకు నచ్చిన రీతిలో ఫీజులను వసూలు చేస్తున్నా సరైన నియంత్రణ లేకపోవడంతో తల్లిదండ్రుల జేబులు గుల్లవుతున్నాయి. మరోవైపున పలు నిబంధనలను ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు తుంగలోకి తొక్కుతున్నాయి. పదో తరగతి, ఇంటర్ చదివిన వారితో తక్కువ జీతాలు ఇచ్చి విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. బిఇడి, డైట్‌సెట్ చేసిన శిక్షణ పొందిన వారితో విద్యనందించాలనే నిబంధన ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీనిపై విద్యా శాఖతో బాటు జిల్లా కలెక్టర్ నియంత్రణ గనుక ఉంటే ఫీజుల భారం తగ్గే అవకాశం ఉంటుందని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యాశాఖ అధికారికి వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

ఉపాధ్యాయ సమస్యలపై ధర్నా

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. సోమవారం యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక డిఇఒ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.సురేంద్రకుమార్ మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతుల్లో ఉన్న అసంబద్ధాలను తొలగించాలని, ప్రాథమిక పాఠశాలలో 1:20 రేషియో పాటించాలని, ఉన్నత పాఠశాలలో 1:40గా విద్యార్థుల నిష్పత్తి ఉంచాలని, ప్రాథమికోన్నత పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిఒ 117 రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి పార్టీల నేతలు అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయులు, విద్యారంగానికి అంతకంటే ఎక్కువ నష్టం కలిగించేలా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ రంగంలో విద్యా వ్యవస్థను నష్టపరిచే విధంగా ప్రస్తుత ప్రభుత్వం విధానం ఉందని ఆరోపించారు. వివిధ రకాల పేర్లతో పాఠశాలలను వర్గీకరించి విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తిని పెంచి పాఠశాలలకు విద్యార్థులను దూరం చేసేలా ప్రభుత్వం నిర్ణయాలు చేస్తుందని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంటివిఎస్.సుబ్బారావు విమర్శించారు. ఉద్యోగన్నతుల విషయంలో పూర్తి పారదర్శకతతో జిఒను విడుదల చేయాలని, మున్సిపల్ పాఠశాలలో పోస్టులన్నీ భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు, జిల్లా గౌరవ అధ్యక్షులు పెంకే వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జివి.రమణ, టి.దుర్గాప్రసాద్, వివిధ మండలాల యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

దశాబ్దాల కాలంగా విలసవిల్లి గ్రామస్తులు ఎదుర్కొంటున్న విద్యుత్ అంతరాయం సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ సలాది ఊర్మిళదేవి కోరారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఆమె అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉప్పలగుప్తం 33/11 కెవి విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి భీమనపల్లి పంచాయతీ సూదాపాలెం మీదుగా హెచ్‌టి లైన్ వేసి విద్యుత్ సరఫరా చేస్తున్నారని తెలిపారు. అయితే విద్యుత్ లైన్ వరి చేలల మీదుగా పంట పొలాల్లో నుంచి తీసుకురావడంతో వర్షానికి గాలులకు తరచూ విద్యుత్ లైన్ దెబ్బతిని విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కల్గుతుందని అన్నారు. దీంతో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం విద్యార్థులు ఆన్‌లైన్ పరీక్షలకు సిద్ధపడుతున్నారని, కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు వర్క్ ఫ్రం హోంలో ఉన్నారని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తమ గ్రామానికి అమలాపురం విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎంపిడిఒ రత్నకుమారికి ఉద్యోగన్నతి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

స్థానిక ఎంపిడిఒగా విధులు నిర్వర్తిస్తున్న కె.రత్నకుమారి తూర్పు గోదావరి జిల్లా డ్వామా విభాగంలో జిల్లా విజిలెన్స్ అధికారిగా ఉద్యోగన్నతి పొందారు. ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులతో ఆమె సోమవారం ఉద్యోగన్నతిపై బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమెను తహశీల్దార్ పి.చిన్నారావు, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్, ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ జి.రాజేంద్రప్రసాద్, ఇఒపిఆర్‌డి మోహన్, ఎంఇఒ కె.తాతారావు, వ్యవసాయాధికారి రమేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వీరభద్రరాజు, పంచాయతీ కార్యాదర్శులు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు.

రత్నకుమారిని సత్కరిస్తున్న అధికారులు, సిబ్బంది

పుష్కరాల ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేయండి

ప్రజాశక్తి - కొత్తపేట

రానున్న పుష్కరాల ఏర్పాట్లకు సమయం ఉన్నా గానీ ప్రణాళికలు రూపొందించి సిద్ధంగా ఉండాలని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్‌డిఒ శ్రీకర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులతో పుష్కరాల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పుష్కరాలకు దేశం నుంచే కాకుండా విదేశాల నుంచి యాత్రికులు పెద్దఎత్తున వస్తారని అన్నారు. నియోజకవర్గంలో ఉన్న పుష్కర ఘాట్లు, ఇతర అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఘాట్ల వద్ద అవసరమైన విద్యుత్ సౌకర్యం, లైట్లు ఏర్పాటు చేసేలా నివేదికను రూపొందించాలని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని దేవాలయాలు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాలను తీర్చిదిద్దాలని ఆయన ఆదేశించారు. పుష్కరాలను వినియోగించుకుని నియోజకవర్గంలో ముఖ్యమైన పనులను పూర్తి చేసేందుకు సంబంధించిన నివేదికను రూపొందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కూటమి సర్కారు అవినీతిపై వైసిపి ధర్నా

ప్రజాశక్తి - అమలాపురం

-కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అవినీతికి వ్యతిరేకంగా వైసిపి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గడియార స్థంభం సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, వైసిపి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి, మాట్లాడారు. చంద్రబాబు నాయకత్వంలో స్కీములన్నీ స్కాములేననని ఆరోపించారు. కుట్టు శిక్షణ పేరుతో బిసిలకు తీరని అన్యాయం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఒక్కొక్క బిసి మహిళలకు రూ.16 వేలు చొప్పున దోపిడి చేసి తమ జేబులు నింపుకుంటున్నారని అన్నారు. ఉచిత కుట్టు మిషన్, శిక్షణకు రూ.7,300 వంతున రూ. 73 కోట్లు ఖర్చు అవుతుండగా, ఒక్కొక్కరి ఖర్చును భారీగా పెంచి మొత్తం రూ.230 కోట్లకు టెండర్ ఆమోదించి భారీ దోపిడీకి తెరతీశారన్నారు. తక్కువ ఖర్చుతో టెండర్ దాఖలు చేసిన కంపెనీలను వదిలి, తక్కువ ధర కోట చేసిన కంపెనీకి 5 శాతం పనులే ఇచ్చి, ఎక్కువ ధర కోట్ చేసిన తమ అనుయాయులకు 95 శాతం పనులు అప్పగించారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం ఒక్కో లబ్ధిదారుకి 45 రోజులపాటు దాదాపు 360 గంటల శిక్షణ ఇవ్వాల్సి ఉంటే, కేవలం 135 గంటల మాత్రమే శిక్షణ ఇచ్చి చేతులు దులిపేసుకుంటున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వ ఖజానాను దోచుకోవడానికి బిసి మహిళలను పావులుగా వాడుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఆర్థికంగా వెనుకబడిన మహిళల పేరుతో జరుగుతున్న అక్రమాల స్కాంను ప్రజలకు వివరించి, ప్రజాధనం వృథా కాకుండా అడ్డుకుంటామని వారు హెచ్చరించారు.

జవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి

ఆపరేషన్ సిందూర్‌లో అమరుడైన అగ్నివీర్ జవాన్ మురళీనాయక్‌కు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం స్థానిక గడియార స్థంభం సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పిల్లి సుబాష్‌చంద్రబోస్, మాజీ మంత్రి విశ్వరూప్, వైసిపి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి, నాయకులు జక్కంపూడి విజయలక్ష్మి తదితరులు మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ కోఆర్డినేటర్లు డాక్టర్ శ్రీకాంత్, గొల్లపల్లి సూర్యరావు, గన్నవరపు శ్రీనివాసరావు, పిల్లి సూర్య ప్రకాష్, మాజీ ఎంపి అనురాధ, మాజీ ఎం రాజేశ్వరి, జడ్‌పి ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, మున్సిపల్ ఛైర్మన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, చెల్లుబోయిన శ్రీనివాసరావు, మట్టపర్తి నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అమర జవాన్‌కు నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

అవార్డులు అందుకున్న తల్లీ, కూతురు

ప్రజాశక్తి - రాజోలు

పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు వేణు గోపాలస్వామి కల్యాణ మండపంలో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన అమ్మకు వందనం కార్యక్రమంలో రాజోలుకు చెందిన కాట్రు రాజేశ్వరి మాతృదేవోభవ ఇండియల్ అవార్డు అందుకోగా ఆమె కుమార్తె నవ్యశ్రీ నిర్విరామంగా డ్యాన్స్ చేసి ప్రతిభా పురస్కారం అందుకుంది. ఈ అవార్డులను శ్రీశ్రీకళావేదిక అంతర్జాతీయ ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్, గజల్ శ్రీనివాస్ చేతులమీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరి భూషణం, జాతీయ కార్యదర్శి పార్థసారధి, స్టార్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



తల్లీ, కుతుళ్లను సత్కరిస్తున్న గజల్ శ్రీనివాస్

గంట్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని నార్కెడిమిల్లిలో ఉన్న గంట్లమ్మ అమ్మవారిని సోమవారం ఎంఎల్ఎ బండారు సత్యానం దరావు దర్శించుకున్నారు. జాతర మహోత్సవంలో భాగంగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ముదునూరి వెంకటరాజు, కరుటూరి నరసింహారావు, కాయలు జగన్నాధం, తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరుని దర్శించుకున్న కార్తికేయ మిశ్రా

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి కార్తికేయ మిశ్రా ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయాన్ని సోమవారం సందర్శించారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి అల్లు వెంకట దుర్గభవాని, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. భీమేశ్వర స్వామి శివలింగాన్ని, మాణిక్యమ్మ అమ్మవారిని దర్శించుకుని కార్తికేయ మిశ్రా దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ డి.అఖిల, తహశీల్దార్ బండి మృత్యుంజయరావు, ఎస్ఐ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న కార్తికేయ మిశ్రా దంపతులు

వికలాంగులకు ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి - రామచంద్రపురం

వికలాంగులకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం ఉచిత ఉపకరణాలను పంపిణీ చేశారు. స్థానిక భవిత కేంద్రాల విద్యార్థులకు ఆలింకో సంస్థ ద్వారా ఈ ఉచిత ఉపకరణాలను మంజూరు చేశారు. కె.గంగవరం, రామచంద్రపురం మండలాలకు చెందిన సుమారు 46 మంది వికలాంగ విద్యార్థులకు ఆలింకో సంస్థ, సమగ్ర శిక్ష ద్వారా మంజూరైన వీల్‌ఛైర్లు, ఎలక్ట్రిక్ మోపెడ్‌లు, బ్రెయిలీ కిట్లు, వినికిడి పరికరాలను మంత్రి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలకు అవసరమైన పరికరాలను అందజేసిన ఆలింకో సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో సేవా సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వంతు సహాయం అందించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి ప్రతి నెల రూ.15 వేలను ఎన్‌టిఆర్ భరోసా పథకంలో పింఛన్ అందిస్తున్నదని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపిడిఒ పద్మజ్యోతి, ఎంఇఒ వీరరాఘవరెడ్డి, కె.గంగవరం ఎంఇఒ నాగరాజు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వికలాంగునికి వీల్ ఛైర్‌ను అందజేస్తున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

సారా రహిత ఆంధ్రప్రదేశ్‌పై అవగాహన

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

సారా రహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం రూరల్ మండలం కామనగరువు, రెడ్డిపల్లి, తండవపల్లి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో నాటుసారా తయారు చేయుట, విక్రయించుట, తాగుట వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ములో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం

ప్రజాశక్తి - మామిడికుదురు

ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తుల వినియోగంతో మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చునని వ్యవసాయ శాఖ ఎఓ బి.మృదుల అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సేంద్రియ ఎరువులతో పండించిన వ్యవసాయ ఉత్పత్తుల విక్రయ స్టాల్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కువమంది రైతులు సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కుడుపూడి జానకి, చెల్లిబోయిన రాధ, కుడిపూడి పద్మావతి, గోగి లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

విద్యార్థినీ, విద్యార్థులు చదువులో పోటీ తత్వాన్ని అలవర్చుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయులు కె.రత్నంరాజు అన్నారు. సోమవారం స్థానిక శాఖ గ్రంథాలయంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు ఇంగ్లీషు, తెలుగు కథల పుస్తకాలు చదవడంపై ఆయన అవగాహన కల్పించారు. గ్రంథాలయ అధికారి టి.నమశ్శివాయ జనరల్ నాలెడ్జ్‌పై శిక్షణ ఇచ్చారు.

కార్టూన్'నిజం'



పిజిఆర్ఎస్ వ్యవస్థను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజలకు ప్రభుత్వ పాలనను మరింతగా చేరువ చేసేందుకు పిజిఆర్ఎస్‌ను బలోపేతం చేయాలని జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన డివిజన్ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఆమె అర్జీదారుల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల స్థాయిలో సమస్యలను మండల స్థాయిలోనూ, డివిజన్ స్థాయి సమస్యలను డివిజన్ స్థాయిలో పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు ప్రభుత్వ పాలనను మరింతగా చేరువ చేయడానికి పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని గుర్తుంచుకోవాలన్నారు. పిజిఆర్ఎస్‌లో వచ్చిన అర్జీని అధికారులు తమ సొంత సమస్యగా భావించి పరిష్కరించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. అర్జీని స్వీకరించింది మొదలు నిర్దేశ గడువులో దరఖాస్తుదారుడు పూర్తిస్థాయి సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించాలని సూచించారు. వివిధ దశల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవహరించాల్సిన తీరుపై సూచనలు చేసి, అధికారుల సందేహాలను ఆమె నివృత్తి చేశారు. సున్నిత అంశాల్లో నేరుగా కలిసి మాట్లాడటం మంచిదన్నారు. మండలస్థాయిలో ఎంపిడిఒ, తహశీల్దార్, ఇతర అధికారులు ఆర్జీల పరిష్కారంలో ప్రత్యక్ష భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు. అప్పుడే ఆర్జీల పరిష్కారంలో నాణ్యతతో పాటు సంతృప్తి స్థాయి పెరుగుతుందన్నారు. కిందిస్థా యిలో పరిష్కారానికి వీలులేని వాటిని సరైన రీతిలో ఉన్నతాధి కారులకు నివేదిం చాలని సూచించారు. అర్జీదారులు టోల్ ఫ్రీ నెంబర్ 1100కు ఫోన్ చేసి సమస్యను నమోదు చేయవచ్చునని, అదేవిధంగా మీకోసం వెబ్‌సైట్‌లోనూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. దరఖాస్తు యొక్క పరిష్కార స్థితిని తెలుసుకునేందుకు 1100 ఫోన్ చేసి సంప్రదిం చవచ్చునని ఆమె అర్జీదారులకు సూచించారు ఈ కార్యక్రమంలో కొత్తపేట ఆర్‌డిఒ పి.శ్రీకర్, తహశీల్దార్ వై.రాంబాబు, ఎంపిడిఒ ఎం.నరేష్‌కుమార్, ట్రాన్స్‌కో ఎడి ఇ.రాజు, సిడిపిఒలు, డివిజన్ స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొ న్నారు.

అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న అధికారులు

మంచినీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - కాట్రేనికోన

కందికుప్ప సెంటర్‌లో పైపు లైన్ పగిలి పోవడంతో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ సుబ్రహ్మణ్యం తెలిపారు. కందికుప్ప ఆర్‌డబ్ల్యుఎస్ స్కీం పరిధిలోని పైపులైన్ పగిలిపోవడంతో మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. ఫలితంగా కందికుప్ప, దొంతికుర్రు, పల్లం, పల్లంకుర్రు, బ్రహ్మసమేద్యం పంచాయతీల పరిధిలోని అన్ని గ్రామలకు మంగళ, బుధవారాల్లో తాగునీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. తాగునీరు ఇబ్బందులు రాకుండా ప్రత్యేమాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పైపులైన్ పగిలిపోవడం వల్ల మహిపాల చెరువు-పల్లంకుర్రు ప్రధాన రహదారిలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుంద న్నారు. భారీ వాహనాలను, ఆర్‌టిసి బస్సులను కందికుప్ప వరకే అనుమతించడం జరుగుతుందన్నారు. పల్లంకుర్రు దిగువ గ్రామాల ప్రజలు పల్లంకుర్రు-మురమళ్ళ ఏటిగట్టు రహదారిలో రాకపోకలు సాగించాలన్నారు. ప్రజలు సహకరించాలని సుబ్రహ్మణ్యం కోరారు.

నేరాలు ఘోరాలు

బస్సు ఢీకొని యువకుని మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం

స్థానిక ఏనుగుబాయి తూము వద్ద రామచంద్రపురం నుంచి యానాం వెళుతున్న ఆర్‌టిసి బస్సు ఢీ కొని ఒక యువకుడు దుర్మరణం చెందారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... హసనబాద గ్రామానికి పిల్లి గోపాలకృష్ణ(27)కి గత నెల 22న వివాహమైంది. సోమవారం అంతవారి ఇంటికి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఏనుగుబాయి తూము వద్ద ఆర్‌టిసి బస్సు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు.

యువతి అదృశ్యం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువతి ఈనెల 10వ తేదీ నుంచి అదృశ్యమైందని తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేశామని చాగల్లు ఎస్‌ఐ కె.నరేంద్ర తెలిపారు. యువతి వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని కోరారు.

దాడిపై కేసు నమోదు

ప్రజాశక్తి - సీతానగరం

బొబ్బిల్లంకలో డబ్బుల వ్యవహారానికి సంబంధించి జరిగిన దాడిలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం బొబ్బిల్లంక గ్రామానికి చెందిన కోమలి స్వామి, అదే గ్రామానికి చెందిన కోమలి వెంకన్నకు గతంలో కొంత డబ్బు ఇచ్చారు. స్వామి తన డబ్బులు తిరిగి ఇవ్వమని అడుగగా వెంకన్న తిరస్కరించాడు. ఈ నేపథ్యంలో ఆదివారం వీరిద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వెంకన్న ఆగ్రహంతో కూల్ డ్రింక్ సీసాతో స్వామి తలపై కొట్టాడు. ఈ దాడిలో స్వామికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాధితుడిని వైద్య నిమిత్తం రాజమండ్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ స్వామి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు ఎస్‌ఐ రామ్‌కుమార్ కేసు నమోదు చేశారు.

10 మందిపై బైండోవర్ కేసు

ప్రజాశక్తి - గోపాలపురం

భీమోలు గ్రామానికి చెందిన పది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. భీమోలు గ్రామంలో గల సర్వే నంబర్ 322లోని 18 ఎకరాల్లోని జీడిమామిడి, మామిడి తోటలు తమకే చెందుతాయని మారెడ్డి రత్నం, కోటి దేవి వర ప్రసాదులకు చెందిన రెండు గ్రూపులు తరచూ ఘర్షణలకు దిగుతున్నారన్నారు. దీనిపై శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా రెండు గ్రూపులకు చెందిన పది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు. ఆరు నెలల పాటు బైండోవర్ అమల్లో ఉంటుందనానరు. ఈ పదిమందిలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట శివారు కోదండరామపురం సమీపాన కారు విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొన్న ఘటనలో ఎవరికీ ప్రమాదం జరగలేదు. పిఠాపురం వైపు నుండి వస్తున్న కారు సామర్లకోట వైపు అతివేగంగా వస్తూ కోదండరామపురం వద్ద రోడ్డు ప్రక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగి కారు ముందు భాగంపై పడింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండటంతో స్థానికులు భయాందోళనలతో పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ సరఫరా నిలుపుదల చేశారు. కారు నడుపుతున్న వ్యక్తి సూరంపాలెంలోని ప్రముఖ యూనివర్సిటీ ప్రిన్సిపల్ అని సమాచారం.

5,200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సోమవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 5200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ దుర్గార్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో భాగంగా సారా తయారీకి ఉపయోగించే 210 కిలోల నల్లబెల్లపు పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడులకు సంబంధించి ఒకరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఆరుగురుని బాధ్యులుగా నిర్ధారించామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు చిట్టిబాబు, నరసింగరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యతిరేక పోస్టులపై నోటీసు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కూటమి ప్రభుత్వంపై సోషల్ మీడియాలో అసత్య ఆరోపణలు చేస్తున్న వ్యక్తిపై 41 నోటీసు ఇచ్చినట్లు ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం...కూటమి ప్రభుత్వాన్ని అప్రతిష్ట పాలు చేసేలా సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కొమానపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు కుంచనపల్లి నారాయణ చేసిన ఫిర్యాదుపై కాట్రేనికోన మండలం కుండలేశ్వరం గ్రామానికి చెందిన చిక్కాల నాగేంద్రను విచారించి 41 నోటీసు ఇచ్చినట్లు తెలిపారు.

చీకటిలో ఉన్న గాంధీనగర్ ప్రాంతం

అంధకారంలో గాంధీనగర్

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని తోటపేటలోని గాంధీ నగర్ వాసులు గత నెల రోజులుగా అంధకారంలో మగ్గుతున్నారు. రాత్రి సమయంలో వీధిలైట్లు వెలగకపోవడంతో స్థానికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ఈ రోడ్లో ఇరువైపులా పంటచేలు ఉండడంతో విషపురుగులు, కుక్కల బెడద అధికంగా ఉంటుందని, చీకట్లో పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆరోపించారు. తక్షణమే విద్యుత్తు లైన్లు పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

సమ్మె జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - అమలాపురం, రావులపాలెం

ఈ నెల 20న జరిగే దేశ్వాప్త సమ్మెను జయప్రదం చేయాలని కేంద్ర కార్మిక సంఘాలు, ఇతర ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం అమలాపురం ఎంప్లాయిస్ హోంలో అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర కార్మిక, వ్యవసాయ, రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను హరించేలా పాలన సాగిస్తుందన్నారు. 49 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లుగా రూపొందిస్తున్నదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ అనుకూల విధానాలను ప్రవేశపెట్టి రైతులు, గిరిజనులు, కార్మికులు, ప్రజలకు తీవ్ర నష్టం చేకూర్చే విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. దేశంలో రైతుల పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లేదని, వ్యవసాయ, పారిశ్రామిక కార్మికులకు చేసేందుకు పూర్తి స్థాయిలో పనులు కల్పించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించడం లేదని అన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కార్మికులకు సమగ్ర చట్టం తెచ్చి వారి జీవనం మెరుగుపడేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తేదీన జరుగుతున్న సమ్మెలో ప్రజలు అధిక సంఖ్యలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు, ఎఐటియుసి, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘాల నాయకులు ఎస్.బలరాం, జి.దుర్గా ప్రసాద్, కారెం.వెంకటేశ్వర రావు, కె.సత్తిబాబు, యు.గోపాల్, పి.రాము, సత్యనారాయణ, ఎం.బాస్కరరావు, పి .శివ, బి.ఎల్తేరు, రాణి, కె.బేబీ గంగారత్నం, నాగలక్ష్మి, పార్వతి, పీతల రామచంద్రరావు, వి. మోహన రావు, నిమ్మకాయల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. అలాగే రావులపాలెం ఎలిమెంటరీ స్కూల్ ఆవరణలో జరిగిన నియోజకవర్గ శ్రామిక మహిళా సమావేశంలో శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కె.కృష్ణవేణి పాల్గొని మాట్లాడారు. జాతీయ కార్మిక సంఘాలు పిలుపు మేరకు ఈనెల 20న జరిగే దేశ వ్యాప్తంగా సమ్మెకు అందరు సన్నద్ధం కావాలన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు, లేబర్ కోడ్ రద్దు, పెరిగిన నిరుద్యోగం, పేదరికం, అసమానతలు వంటి సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశ వర్కర్లు, వివిధ రంగాలకు చెందిన మహిళలు, కార్మికులు పాల్గొన్నారు.

అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశంలో మాట్లాడుతున్న కారెం వెంకటేశ్వరావు

సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

మజ్జిగను పంపిణీ చేస్తున్న ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - రావులపాలెం

స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద విశ్రాంత తహసీల్దార్ కొప్పిశెట్టి దుర్గారావు ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మే నెలలో అధిక ఉష్ణోగ్రత వల్ల ఎండలు తీవ్రంగా ఉన్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అటువంటి వారి దాహార్తిని తీర్చేందుకు విశ్రాంత తహశీల్దార్ కొప్పిశెట్టి దుర్గారావు ఆయన చిన్న కుమారుడు కొప్పిశెట్టి శశికాంత్ జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.ఎం.ముక్తేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షుడు గుత్తుల పట్టాభిరామారావు, ఆత్రేయపురం మండల టిడిపి అధ్యక్షుడు ముదునూరి వెంకటరాజు, నాయకులు జక్కంపూడి వెంకటస్వామి, జడ్‌పి బాలికల ఉన్నత పాఠశాల ఎస్‌ఎంసి ఛైర్మన్ కోట సోమేశ్, పడాల బుల్లి, కొండా రెడ్డి, కోట వెంకటేశ్వరరావు, కుడిపూడి వెంకటరమణ, కోనాల అంబేద్కర్,గుర్రాల నాగభూషణం,పసుపులేటి రాధాకష్ణ, సాధనాల శ్రీనివాసరావు, గుర్రాల రాజు, డిటి నందుల శ్రీనివాసరావు, ఆర్‌ఐ సూర్యకాంతం పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు పిలుపునిచ్చారు. స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో సోమవారం అంబేద్కర్ 134వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత అంబేద్కర్ నిలువెత్తు విగ్రహనికి నగర పంచాయతీ ఛైర్మన్ ప్రవీణ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంబేద్కర్ కన్వెన్షన్ హాలు వద్ద జరిగిన సభకు ప్రవీణ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సభలో ఎంఎల్‌ఎ మాటాడుతూ అంబేద్కర్ సమాజంలో అసమానతల నిర్మూలనకు జీవితాంతం పోరాడారని అన్నారు. ప్రతి ఒక్కరూ విద్యావంతులు అయినపుడే వివక్షతలు తొలగుతాయన్నారు. ఎంపి హరీష్‌మాధుర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. జన చైతన్య మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు పి.పావన్‌ప్రసాద్ మాట్లాడుతూ అంబేద్కర్ అసమానతలకు మూలమైన కుల వ్యవస్థను కూకటి వేళ్ళతో పేకలించాలంటే శక్తి వంతమైన ఆయుధం విద్య అని, అంబేద్కర్ ఎన్నో కష్టాలు పడి పెద్ద పెద్ద చదువులు చదువుకుని, ఈ దేశానికి రాజ్యంగాన్ని రాశారని గుర్తు చేశారు. అటువంటి రాజ్యాంగాన్ని మార్చడానికి కొన్ని శక్తులు ప్రయత్నాలు చేస్తున్నాయని, రాజ్యంగాన్ని మారిస్తే భవిష్యత్ తరం పిల్లలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఉండవన్నారు. రాజ్యంగాన్ని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ విద్యావంతులై, ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకున్నప్పుడే హక్కులను కాపాడుకోవచ్చునని సూచించారు. అంతకుముందుగా పల్లి పాలెం సెంటర్ నుంచి సభ స్థలి వరకు ఊరేగింపు జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ చెల్లి వివేకానంద, నాయకులు చెల్లి అశోక్, ముంగండ ఆశీర్వాదం, వడ్డీ నాగేశ్వరరావు, డి అంజనేయులు, జనిపల్లి సత్యనారాయణ, పుణ్యమంతుల రజిని, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ దాట్ల సుబ్బరాజు

జనసేనలో పలువురి చేరిక

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని మెర్లపాలెం గ్రామానికి చెందిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి సామాజికవర్గాలకు చెందిన పలువురు వైసిపి కార్యకర్తలు జనసేన పార్టీలో చేరారు. వీరికి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ బండారు శ్రీనివాస్, నాయకులు చేకూరి కృష్ణంరాజు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కో ఆర్డినేటర్ రంకిరెడ్డి వినయ్‌కుమార్, ఎంపిటిసి సభ్యులు ఎం.వీరబాబు, రంకిరెడ్డి అశోక్‌కుమార్, మెర్ల రామాంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం

ప్రజాశక్తి - రామచంద్రపురం, మండపేట

రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో అంతర్జాతీయ నరుఊసల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సులను ఆసుపత్రి సూపర్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.ప్రవీణ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. నర్సుల ఆరాధ్యదైవం 'ఫ్లోరెన్స్ నైటింగేల్' జన్మదినం సందర్భంగా ప్రవీణ్ అంతర్జాతీయ నర్సుల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. లేడీ విత్ ది లాంప్‌గా పేరు గాంచిన 'ఫ్లోరెన్స్ నైటింగేల్' సేవలు నేటితరం నర్సులు అందరికీ ఆదర్శనీయమని, రోగుల ఆరోగ్య పరిరక్షణలో మీ సహకారం మరువలేనిదన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల నర్సులు ప్రేమ, దయ, కరుణ, జాలి కలిగి ఉండాలన్నారు. ప్రతి రోగిని కంటికి రెప్పలా, ఒక అమ్మలా కాచి కాపాడుతున్నారని కొనియాడారు. కరోనా వంటి విపత్కర సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా లక్షలాది ప్రాణాలను కాపాడిన ఘనత నర్సులకు దక్కుతుందన్నారు. అనంతరం పలువురు నర్సులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. తొలుత ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంఒ డాక్టర్ చక్రధర్, నర్సింగ్ సూపరింటెండెంట్ జయప్రద, ఏరియా ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండపేట పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కోన సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మండపేట ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాధామాధురి, సీనియర్ నర్సు మాధురిలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ 60 సంవత్సరాల సావనీర్‌ను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కె.సతీష్, చంటిపిల్లల వైద్యులు డాక్టర్ నాగలక్ష్మి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కురసాల సత్యనారాయణ, అసోసియేషన్ ప్రతినిధులు ఇరవాడ రవికుమార్, మారిశెట్టి సత్యనారాయణ, మండిపూడి చంద్రశేఖర్, గాలింకి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నైటింగేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నర్సులు

సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని రాజవరం గ్రామాన్ని సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దామని కొత్తపేట ఎక్సైజ్ ఎస్‌ఐ కె.అన్నవరం అన్నారు. నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా సోమవారం రాజవరం గ్రామంలో సారా విక్రయిస్తూ పట్టుబడి కేసులు నమోదైన 11 మందిపై ముందస్తు చర్యగా బైండోవర్ కేసులు నమోదు చేసి, మండల మెజిస్ట్రేట్ టిఆర్.రాజేశ్వరరావు ఎదుట హాజరుపర్చినట్లు ఆయన తెలిపారు. సారా రహిత గ్రామంగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు.

పళ్లాలమ్మను దర్శించుకున్న ఎంఎల్‌ఎ

ప్రజాశక్తి - కొత్తపేట

మండలంలోని వానపల్లి గ్రామంలో ఉన్న పళ్లాలమ్మ అమ్మవారిని ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు దర్శించుకున్నారు. పళ్లాలమ్మ అమ్మవారి జాతర ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతరకు భక్తులు భారీగా తరలి వస్తారని అందుకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పల్లి భీమారావు, ధర్నాల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - రామచంద్రపురం

తాళ్లపొలం ఆర్ అండ్ బి రోడ్డు నుంచి ఆదివారపుపేట వరకు కోటి రూపాయలతో నిర్మిస్తున్న బిటి రోడ్డుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం శంకుస్థాపన చేశారు. రోడ్డు పనులను ప్రారంభించి త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులు పూర్తచేయాలని గుత్తేదారుడిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎఇ యేసురత్నం, ఎంపిడిఒ పద్మజ్యోతి, ఆదివారపుపేట సర్పంచ్ దొరబాబు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జనరల్ నోటీసు

మహారాజశ్రీ అనకాపల్లి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

S.O.P. No. 5/2025

బిట్వీన్: 1.శ్రీమతి యలమంచిలి దుర్గాభవాని 2.శ్రీమతి యలమంచిలి వెంకట పద్మప్రియాంక 3.శ్రీ యలమంచిలి కార్తికేయ నాయుడు ... పిటీషనర్స్

అండ్: నిల్ ... రెస్పాండెంట్స్

ఇండియన్ సెక్సేషన్ యాక్టు సెక్షన్ 372 ప్రకారం

పై నెంబరు పిటిషన్‌లో 1వ పిటిషనరు యొక్క భర్తయున్నూ మరియు 2,3 పిటిషనర్సు యొక్క తండ్రియున్నూ అయిన శ్రీ యలమంచిలి లక్ష్మణరావుగారు, సామర్లకోట రైల్వేస్టేషన్, క్యాటరింగ్ సర్వీసెస్ ఫ్లాట్‌ఫారం స్టాల్-1ను నిర్వహిస్తూ తే 08-02-2025దిన మరణించియున్నారు. సదరు రైల్వే అథారిటీ / డిపార్టుమెంటు వారు సదరు స్టాలు కొనసాగించుకొనుటకు మరణించిన ఆసామీ తరపు వారసులుగా నిర్ణయిస్తూ సక్సేషన్ సర్టిఫికేట్ దాఖలు చేయమని అదేశించి యున్నారు. అంతట సదరు సక్సేషన్ సర్టిఫికెట్టు యిప్పించ గోరి పిటిషనర్సు పై నెంబరు పిటిషన్‌ను కోర్టులో దాఖలు చేసియున్నారు.

కావున, అందును గురించి ఎవరికైనను ఎటువంటి ఆక్షేపణలు వున్న ఎడల అట్టి వారు ది. 24-6-2025న ఉదయం 10-30లకు స్వయంగా పై కోర్టులో హాజరై తమ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనిచో శ్రీకోర్టు వారు ప్రస్తుతం వున్న పిటిషనర్ల, వాదనలు పరిశీలించి తగు విధముగా పరిష్కరించదమగునని ఇందుమూలంగా తెలియచేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వులు మేరకు)

సుంకర శ్రీనివాసరావు ఎమ్.ఎ., ఎమ్.ఎ., బి.ఎల్.
అడ్వకేటు & నోటరీ
వైజయంతి అపార్టుమెంట్, ఉడ్‌పేట,
అనకాపల్లి. సెల్: 98486 14189

పట్టణానికి రోడ్లు అనుసంధానం

ప్రజాశక్తి - అమలాపురం

ఈదరపల్లి బ్రిడ్జి నిర్మాణం వల్ల ఏర్పడిన ట్రాఫిక్ సమస్యపై ఎంఎల్‌ఎ అయితాబత్తుల ఆనందరావు దృష్టి సారించారు. సోమవారం పట్టణానికి అనుబంధంగా ఉన్న రోడ్ల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఏళ్ల తరబడి పట్టించుకోని సీతాపతిరావు పేట- బరియల్ గ్రౌండ్ రోడ్డును తక్షణమే పునర్ధించాలని మున్సిపల్ డిఇకి ఆయన ఆదేశాలు జారీ చేశారు. అలాగే చిన్న వంతెన పక్కన నిర్మాణంలో ఉన్న విశ్వరూప్ మార్గ్‌ను బరియల్ గ్రౌండ్‌కు కలపాలని, రెండు వైపుల ప్రజల రాకపోకలకు తక్షణమే ఏర్పాట్లు చేయాలని ఆయన అన్నారు. ఈ పర్యటనలో అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ జడ్‌పిటిసి అధికారి జయలక్ష్మి, కౌన్సిలర్ బండారు గోవింద్, వైసిపి నేత గోపి రమేష్, భాస్కర్ల రామకృష్ణ పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆలోచన విధానంతో అడుగులు వేయాలి

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

అంబేద్కర్ ఆలోచనా విధానంతో అడుగులు వేయాలని ఎంఎల్‌ఎ అయితాబత్తుల ఆనందరావు అన్నారు. సోమవారం మండలంలోని మునిపల్లి పంచాయతీ కోటుగట్టులో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ నిలువెత్తు విగ్రహానికి ఎంఎల్‌ఎ ఆనందరావు, ఎంపిటిసి సభ్యుడు నిమ్మకాయల రాము, మాజీ జడ్‌పిటిసి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, మాజీ ఎఎంసి ఛైర్మన్ నిమ్మకాయల సూర్యనారాయణ మూర్తి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం బిఎస్‌పి జాతీయ కార్యదర్శి డిబి లోక్ అధ్యక్షతన జరిగిన సభలో ఎంఎల్‌ఎ ఆనందరావు మాట్లాడుతూ అంబేద్కర్ ఒక జాతికి నాయకుడు కాదని, ఆయన జాతీయ నాయకుడని, ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు.



పూలమాలలు వేస్తున్న ఎంఎల్‌ఎ ఆనందరావు

పురపాలక సంఘ కార్యాలయము, పిఠాపురం

ఆర్.ఒ.సి. నెం.33/2025-ఇ1 ది.12-05-2025

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

పిఠాపురం పురపాలక సంఘమునకు సంబంధించిన 15వ ఆర్థిక సంఘ నిధుల నుండి 2 నెం. పనులు రూ. 57.91 లక్షలు మరియు సాధారణ నిధులు నుండి 2 నెం. పనులు రూ. 44.80 లక్షలు వెరసి మొత్తం పనులు 4 నెం. రూ. 102.71 లక్షలకు గాను ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా ఈ క్రింది తెలిపిన సైట్‌లలో టెండర్లు కోరబడుచున్నవి.

మిగిలిన వివరములు https://tender.apeprocurement.gov.in నందు మరియు ఇతర వివరముల కొరకు సెల్ నెం. 9849906523 ద్వారా తెలుసుకొనవచ్చును.

బిడ్డు డాక్యుమెంటు డౌన్ లోడ్ ప్రారంభ తేది : 12-05-2025 సమయం సాయంత్రం గం॥ 5.00
బిడ్డు డాక్యుమెంటు డౌన్ లోడ్ ఆఖరి తేది : 26-05-2025 సమయం సాయంత్రం గం॥ 4.30

సం/- కమిషనరు, పిఠాపురం పురపాలక సంఘం

డాక్యుమెంట్స్ పడిపోయినవి

జగ్గంపేట మండలం, కాట్రావులపల్లి గ్రామానికి చెందిన కందుల రాజ్యలక్ష్మి, W/o. విజయభాస్కర్ అను నేను తెలియజేయునది ఏమనగా,

నాకు కాట్రావులపల్లి గ్రామంలో సర్వే నెంబర్ డాక్యుమెంట్ నెం. 921/2016 మరియు S.No. 1043/2023 & C.No. 832/2023, Dt. 10-7-2023 జగ్గంపేటలో రిజిస్టర్ కాబడిన 277/3-A-1 లో 0.09 సెంట్లు జిరాయితీ మెరక భూమి కలదు. నా భూమి యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్స్ తీసుకుని కాకినాడ వెళ్ళుచుండగా దివి. 27-4-2025వ తేదీన పెద్దాపురం దర్గా సెంటర్ నందు జిరాక్స్ తీయించుటకు చూసుకొనగా ఎక్కడో పడిపోయినది. దొరికినవారు ఈక్రింది అడ్రస్‌కు అందజేయవలసిందిగా కోరి ప్రార్థించుచున్నాను.

కందుల రాజ్యలక్ష్మి
W/o. గరగ విజయభాస్కర్
డో.నెం. 1-139/2, భవాని నగర్
కొత్తూరు సెంటర్, అచ్చంపేట జంక్షన్, కాకినాడ
సెల్: 9490401634, 9492156653

వైభవంగా వైశాఖ బుద్ధ పౌర్ణమి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మానవ మనుగడకు బౌద్ధమే శరణ్యమని ఉపాసిక ఎం.ఆశీర్వాదం అన్నారు. స్థానిక బుద్ధ పార్కు ఆవరణలో అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో 2569వ బుద్ధ జయంతి, వైశాఖ బుద్ధ పౌర్ణమి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో భాగంగా ఉపాసిక ఆశీర్వాదం తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు, బుద్ధ విగ్రహం వద్ద పుష్పలు అర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌతమ బుద్ధుని జననం, జ్ఞానదయం పొందడం మహాపరి నిర్వాణం చెందడం యాధృచ్ఛికమని,. వైశాఖీ పౌర్ణమి రోజునే జరగడం బౌద్ధులు పవిత్ర దినంగా పాటించి, బుద్ధ జయంతిగా జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాశి బాబు, జగ్జీవన్ రామ్, కాశి రామచంద్రరావు, వర్మ, సిద్ధార్థకుమార్, బాలకృష్ణ, వెంకట్రావ్, అంజనేయులు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బుద్ధిని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ముమ్మిడివరం నగర పంచాయితీ

ఆర్ఒసి నెం.250/2024/ఇ1 ది.12-05-2025

ఇ-ప్రొక్యూర్‌మెంట్ షార్టు టెండరు నోటీసు

ముమ్మిడివరం నగర పంచాయితీ, ఇంజనీరింగు విభాగమునకు సంబంధించి సాధారణ నిధులతో వీధి లైట్ల మెటీరియల్స్ సప్లై చేయు పనికి రూ. 5.00 లక్షల అంచనాలతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా షార్టు టెండర్లు పిలువబడినవి.

బిడ్ డాక్యుమెంట్ ప్రారంభ తేది : 13-05-2025 ఉదయం గం॥ 11.00ల నుండి
బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ఆఖరు తేది : 19-05-2025 సాయంత్రం గం॥ 3.00ల వరకు
బిడ్ డాక్యుమెంట్ తీసుకొనుటకు ఆఖరు తేది : 19-05-2025 సాయంత్రం గం॥ 4.00ల వరకు

మిగిలిన వివరముల కొరకు కార్యాలయ పని వేళలలో ఇంజనీరింగు విభాగము నందు సంప్రదించగలరు.

సం/- కమిషనరు
ముమ్మిడివరం నగర పంచాయితీ

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION) KOTHAPETA

E.P. No. 1/2019 O.S. No. 28/2016

Between:

D.H.R : Karri Sudhakara Reddy
J.D.R : 1. Medapati Uma Varalakshmi (died)
2. Medapati Venkata Reddy
3. Goluguri Venkata Lakshmi
4. satti Lakshmi
5. Medapati Ananda Suryanarayana Reddy

D.H.R. తరపున వేయించిన వేలం ప్రకటన

పై నెంబరు గ్రంధములో E.P. తాలూక JDR కు సంపూర్ణ హక్కు భుక్తములో గల రావులపాలెం గ్రామంలోని యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థినీ పై నెంబరు E.P బాకీ రాబట్టు నిమిత్తం ది. 16-06-2025 సం.రం. తేదీన ఉదయం 10-30 ని॥ల నుండి పై కోర్టు వారి ఎదుట బహిరంగ వేలం వేయబడునని ఇందుమూలముగా తెలియ చేయడమైనది.

వేలం షెడ్యూలు

Dr. B.R. Ambedkar, Konaseema District, Ravulapalem, Sub. registrar Ravulapalem Village, Residencial site 201.67 Sq. yards in R.S.No. 266/1 (Supplemental S.No. 266/1 B2) bounded on

EAST : Sit of Velagala Meenakshi
SOUTH : Sit of Kovuri Thatha Reddy, Kovuri Musalamma & others
WEST : Sit of Goluguri Venkata Rami Reddy
NORTH : Sit of Goluguri Ramanjaneya Reddy & others

Within the boundaries
D.H.R Value - Rs. 5,00,000/-
Amina Value - Rs. 20,00.000/-

వంగూరి వెంకట సత్యనారాయణ
Dt: 12-05-2025 Advocate for D.H.R
Cell: 92900 73222, 7989146859

సికిల్ సెల్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి - మామిడికుదురు

లూటుకుర్రు పిహెచ్‌సి ఆధ్వర్యంలో పాశర్లపూడిలంకలో సోమవారం సికిల్ సెల్ వ్యాధి నివారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తెలగారెడ్డి సూర్య ప్రకాశరావు మాట్లాడుతూ సికిల్ సెల్ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య సిబ్బంది మాట్లాడుతూ అనీమియా లేదా కొడవలి కణ రక్తహీనత అనేది ఒక వంశపారపర్యంగా వస్తుందన్నారు. సాధారణంగా మనిషి రక్తంలోని ఎర్రరక్త కణాలు గుండ్రంగా పెప్పెర్‌మింట్ల ఆకారంలో ఉంటాయన్నారు. ఈ కణాలు రక్తనాళాల ద్వారా శరీరమంతా ప్రయాణిస్తూ వివిధ అవయవాలకు ప్రాణవాయువును సరఫరా చేస్తుంటాయని, కొంతమందిలో జన్యుసంబంధ మార్పుల వల్ల ఎర్ర రక్త కణాలు కొడవలి ఆకారంలోకి మార్పు చెందుతాయని, ఈ సికిల్ సెల్ ఉన్నవారి రక్తకణంలోని ఒక జన్యువు సికిల్ సెల్‌గానూ, ఒకటి మామూలుగానూ ఉన్నట్లయితే అటువంటి వారిని సికిల్ సెల్ క్యారియర్లు అంటారని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, ఎఎన్ఎం, ఆశ వర్కర్, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయం, సాకుర్రు

టెండరు ప్రకటన

రి.క. నెం.02/2025 తేది.07-05-2025

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం మండలం, సాకుర్రు గ్రామపంచాయతీ 2025-2026 సంవత్సరమునకు గాను అవసరమగు ఈ దిగువ చూపిన ఐటెం తాలూకు వివిధ విడిభాగములు మరియు మందులు సరఫరా చేయుటకును మరియు వివిధ సేవలు నిమిత్తం సీలు వేసిన టెండర్లు ఈ దిగువ సంతకపు అధికారి వారిచే గాని, వారి అనుమతి పొందిన మరియొకరిచే గాని ది. 19-05-2025వ తేదీ మధ్యాహ్నం గం॥ 12.00లకు వరకు తీసుకొని అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షములో మధ్యాహ్నం గం॥ 12.30లకు సదరు టెండర్లు తెరవబడును. మిగిలిన వివరములు కార్యాలయం పని వేళలలో తెలుసుకొనవచ్చును.

వ.నెం.	వివరములు	ధరావత్తు (రూ.)
1	2025-2026 సంవత్సరమునకు అవసరమగు ప్రజారోగ్య పనిముట్లు, మందులు సరఫరా చేయుటకు	500/-
2	2025-2026 సంవత్సరమునకు అవసరమగు మంచినీటి సరఫరా విడిభాగములు సరఫరా చేయుటకు	500/-
3	2025-2026 సంవత్సరమునకు అవసరమగు స్టేషనరి సామానులు సరఫరా చేయుటకు	500/-

సం/- గుత్తుల చిరంజీవిరావు
సర్పంచ్, సాకుర్రు గ్రామపంచాయతి

సం/- వి.రమా శైలజ
పంచాయితీ కార్యదర్శి, సాకుర్రు గ్రామపంచాయతి

గమనిక: 1. గ్రామపంచాయితీ నిధులు నిల్వలను అనుసరించి వరుస క్రమములో చెల్లించబడును.
2. గ్రామపంచాయితీనకు సరఫరా చేయబడు సామాన్లు మంచి నాణ్యత కలిగి మార్కు ISI కలిగి యుండవలెను.
3. టెండరును ఆమోదించుట గాని, నిరాకరించుటకు గాని పంచాయితీ వారికి పూర్తి అధికారము కలదు.